


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు (డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (43)

### *రావుగారింట్లో ఇడ్లీ ముచ్చట్లు*

జీవితాన్ని ఆస్వాదించడానికీ, అవగాహన చేసుకుందుకూ మధ్యతరగతికి మించినది లేదు.

నలుగురితో ఎలా మసలాలో, ఎలా మసలకూడదో అక్కడే తెలుస్తుంది.

ఎలా మసలకూడదని మనమనుకుంటామో, అలాగే మసలేవారిని ఎలా స్వీకరించాలో కూడా అక్కడే తెలుస్తుంది.

మనకి నచ్చనివారిలో మంచినీ, నచ్చినవారిలో చెడునీ గ్రహించేందుకు సహకరిస్తుంది.

ఐతే నాలుగు గోడలకే పరిమితమైనవారికి ఇవన్నీ సాధ్యపడవు.

నలుగురితో కలిసిమెలిసుండాలని పెద్దలనేది అందుకే.

బెర్లిన్లో రావుగారి పరిచయంతో- అతి చిన్నవిగా మనం భావించే విషయాలకు జీవితంలో ఎంత ప్రాముఖ్యముంటుందో మరింత బాగా అర్థమయింది.

ఉదాహరణకి ఇడ్లీ....

మామూలుగా తెలుగువాళ్లకి ప్రత్యేకమైన ఫలహారాల్లో ఇడ్లీ ఒకటి.

తెలుగునాట ఎక్కువమంది హోటలు కెడితే ముందు ఇడ్లీ ఆర్డరిచ్చి ఆ తర్వాతనే పెసరట్టో, దోశో, పూరీలో చెబుతారు.

ఒక్కటే ఐటం తినేవాళ్లయితే, ఇడ్లీ చెప్పి కాఫీ చెప్పేస్తారు.

రావుగారికిది తెలుసు. ఆపైన తెలుగు నాట తనది కోనసీమ. అతిథ్యంలో ప్రపంచప్రఖ్యాతి గాంచిన డొక్కా సీతమ్మ ప్రభావితం చేసిన ప్రాంతమది. సత్యవతిగారు ఆయనకు తగిన ఇల్లాలు.

బెర్లిన్లో కొన్నాళ్లుండడానికొచ్చిన తెలుగువాళ్లు ఇడ్లీ ఫలహారాన్ని తప్పక మిస్సవుతారని ఆ దంపతులు అనుకుంటారు.

తెలుగు వాళ్లెవరైనా తమ ఇంటికొస్తున్నట్లు కనీసం ఓరోజు ముందుగా తెలిస్తే చాలు- కనీసం మొదటిసారికి ఇడ్లీతో ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటారు.

అందుకని వాళ్లు ఇక్కడ దొరకనివి ఇండియానుంచి ఓడలో తెప్పించుకున్నప్పుడు, ఇడ్లీనూకని కాస్త ఎక్కువే తెప్పిస్తుంటారు.

మాకు ఇడ్లీ తినిపించాలనే ఆశయంతోనే ఓ శనివారం మమ్మల్ని ఫలహారానికి పిలిచారు.

నాకైతే ఇడ్లీ గురించిన ఎక్స్‌యింట్మెంటు కంటే, ఆ సమావేశంలో ఆయన చెప్పబోయే ఇడ్లీ కథ వినాలన్న ఆత్రుతే ఎక్కువగా ఉంది.

వెడుతూనే నేను రావుగార్ని, "ఇడ్లీల గురించి ఏదో కథ చెబుతానన్నారు" అన్నాను.

"అది ఫలహారానికి ముందు చెప్పకూడదు. తర్వాత కూడా వాతావరణం అనువుగా ఉంటేనే!" అన్నాడు రావుగారు.

అతడలా అనేసరికి-నిజంగా ఏదైనా కథ ఉందా, లేక మాకు ఆతిథ్యమివ్వడానికి ఊరికే అలా అన్నారా అనిపించింది.

నేను కూడా మరీ నొక్కించలేదు.

"కథ అనుమానమని మమ్మల్ని నిరుత్సాహపర్చారు. మమ్మల్ని ఉత్సాహపర్చడానికి సత్యవతిగారు ఓ పాట పాడాలి" అంది శ్రీమతి.

విన్నపం యథాలాపమో, కళాప్రియత్వమో– కళాకారులకు తెలుస్తుంది.

సత్యవతిగారు వెంటనే పాట అందుకున్నారు.

'చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ......'

తెనాలి రామకృష్ణ సినిమాలో విశ్వనాథన్-రామ్మూర్తి సంగీతంలో సుశీల పాడిన పాట ఆరోజుల్లోనూ నాకెంతో ఇష్టం. అది లలితం.

అదే పాటని కొంచెం శాస్త్రీయ సంగీతపు వణుకులతో కలిపి పాడింది సత్యవతి. వింటుంటే ఇలాగే ఎక్కువ బాగుందనిపించింది,

ఆపైన ఆ సుశీలే ఆహా అనదా అనిపించే గొంతులో ఆలాపన, చరణాలు.

ఆ వీనుల విందు తర్వాత ఏ విందైనా మురిపించడం కష్టమే!

కానీ వారారోజున ఆతిథ్యమివ్వడానికి ఎన్నుకున్నవి ఇడ్లీలు.

దూది పింజలాంటి ఇడ్లీలు. పరిమాణంలో కాస్త పెద్దవి.

అనుపానంగా కొబ్బరి చట్నీ, అల్లం చట్నీ, కారప్పొడి-నెయ్యి.

ముందు పిల్లలకి పెట్టేసేక మేమూ తినడానికి కూర్చున్నాం.

"నేను వడ్డిస్తా" అంటూ శ్రీమతి మా నలుగురి ప్లేట్లలోనూ రెండేసి ఇడ్లీలు వేసింది.

రావుగారు నవ్వి, "అమ్మో! ఈమెకి లౌక్యం ఎక్కువే, మాటవరసకి వడ్డిస్తానన్నా, పిలిచినవారే వడ్డించాలన్న పట్టింపన్న మాట!" అన్నాడు.

అంటే తను తక్కువ వడ్డించిందని అతడి భావం.

మేము స్పందించేలోగానే సత్యవతి అందరి ప్లేట్లలోనూ, మరో రెండేసి ఇడ్లీలు వేసింది.

"చిన్నవైతే మూడు, తప్పితే నాలుగు. ఇవి చాలా పెద్దవి. రెండుకంటే తినడం కష్టం" అని ప్లేట్లో ఇడ్లీ తీసెయ్యమని శ్రీమతికి సైగ చేశాను.

"ఏంచేస్తాం? కష్టాలు చెప్పి రావని సరిపెట్టుకోండి" అంటూ రావుగారు శ్రీమతి ప్రయత్నానికి అడ్డుమాట వేశాడు.

ఐనా శ్రీమతి మా ఇద్దరి ప్లేటల్లోంచీ ఒకో ఇడ్లీ తీసేసింది.

"మేం తియ్యడం లేదు. ఎందుకంటే మీరు తీసేసింది మీ చేత తినిపించడానికి నైతికబలం కావాలిగా" అన్నాడు రావుగారు.

తర్వాత సరదాగా అంతా టిఫిన్ చేశాం.

'కొబ్బరి చట్నీ ఎలా చేసినా బాగానే ఉంటుంది. మీ ఇంట్లో మరింత బాగుంది. కానీ అల్లం చట్నీ చెయ్యాలంటే పదునెక్కువ. కుదరక మేం చేసుకోవడం మానేశాం. పదును కుదిరిన అల్లం చట్నీ అంటే ఇదీ!" అన్నాను.

శ్రీమతి వెంటనే సత్యవతిగారిని– ఆ చట్నీ ఫార్ములా అడిగింది.

సత్యవతికి తెలుసు. ఆ చట్నీ తనకే ప్రత్యేకమైనదని. కానీ మొహమాటంతో, "అందులో ఏముందీ, మామూలుగానే చేశాను" అంది.

ఆ పూట మేము నాలుగేసి ఇడ్లీ తిన్నాం. నాల్గవది తిన్నాక పొట్ట బరువెక్కింది కూడా.

"బయల్దేరాలన్నా కదిలే పరిస్థితి లేదు. ఇందాకా చెబుతానన్నారు. కాలక్షేపానికైనా ఇప్పుడా ఇడ్లీ కథ చెప్పండి" అన్నాను.

రావుగారు సత్యవతివంక చూశాడు. అతడి ప్రశ్న కళ్లలో ఉంది.

'ఫరవాలేదు. చెప్పొచ్చు' అన్నాయామె కళ్లు.

రావుగారు గొంతు సవరించుకుని, "కవిబాబు మీకు తెలుసు కదా, అతడే ఈ కథలో హీరో!" అన్నాడు....

కవిబాబు వాళ్లకి ఇటీవలే పరిచయమయ్యాడు. ఆ వెంటనే వచ్చిన శనివారం విందుకి ఆహ్వానించాడు రావుగారు.

'విందుకా, ఐతే ఈ శనివారం కుదరదు. మరోసారి వస్తాంలెండి' అన్నాడు కవిబాబు.

'ఏం, ప్రతి శనివారం ఉపవాసముంటారా?' అడిగాడు రావుగారు.

'అన్ని శనివారాలూ కాదు కానీ, ఈ శనివారం నేను అన్నం తినను. ఫలహారమే– అదీ లైటుగా' అన్నాడతడు.

'తొలి పరిచయం కదా, లైటుగా టిఫినే మంచిది, విందు భోజనానికి మరోసారి వద్దురుగాని' అన్నాడు రావుగారు.

కవిబాబు సరేనన్నాడు.

అతడికోసం ఇడ్లీ ప్లాన్ చేసింది సత్యవతి.

శనివారం కవిబాబు వచ్చాడు.

కాసేపు అవీ ఇవీ కబుర్లు చెప్పుకున్నాక వంటింట్లోకి వెళ్లింది సత్యవతి. లోపల్నుంచి కొబ్బరి చట్నీ, అల్లం చట్నీ, కారప్పొడి, నెయ్యి ఉన్న నాలుగు గిన్నెలు తెచ్చి, డైనింగ్ టేబుల్ కం టీపాయ్ మీద పెట్టింది. అప్పటికే బల్లమీద మంచినీళ్లతో గ్లాసులున్నాయి.

తర్వాత ఇడ్లీలు తేవడానికి లోపలికెళ్లింది.

ఇడ్లీల పరిమాణం కాస్త పెద్దదే.

మామూలుగా ఐతే రాత్రికి ఫలహారం చేసినప్పుడు రావు దంపతులు ఒకొక్కరు మూడేసి ఇడ్లీలు తింటారు.

ఆ రోజు అతిథి ఉన్నాడు కదా అని ప్లేట్లో నాలుగు ఇడ్లీలు వడ్డించి తీసుకొచ్చి రావుగారికీ, కవిబాబుకీ అందించి, 'అనుపానాలన్నీ కొంచెమైనా రుచి చూసి నా వంటకు సర్టిఫికెట్ ఇవ్వాలి' అందామె కవిబాబుతో.

ప్లేట్లో టిఫిన్ చూస్తూనే, 'ఇడ్లీలా?' అని పెదవి విరిచాడు కవిబాబు.

రావుగారు నొచ్చుకుని, 'మీకు ఇడ్లీలు నచ్చవా?' అన్నాడు.

'అయ్యో, ఇడ్లీ నచ్చని తెలుగువాడుంటాడా? నేను పదహారణాల ఆంధ్రుణ్ణి. కానీ ఈ జర్మన్ అన్న పదం ఉందే, దాంతో వచ్చింది తంటా. సిల్వర్ ముందు జర్మన్ అన్న పదం తగిలించండి– అర్థమెంత మారిపోతుందో! జర్మన్ సిల్వర్ లాగే జర్మన్ ఇడ్లీలన్నమాట! అవంటే నాకు భయం' అన్నాడు కవిబాబు.

రావుగారికి అర్థమయింది. ఐనా బయటపడకుండా, 'ఎందుకని?' అన్నాడు.

'ఏంలేదు– కొన్నాళ్లుగా నాకో పన్ను నొప్పిగా ఉంటోంది. డెంటిస్టు అపాయింట్మెంట్ తీసుకోవాలనుకుంటున్నాను. ఈలోగానే మీరు పిలిచారు, టిఫిన్ ఇడ్లీ అని ముందుగా చెబితే, పెయిన్ కిల్లర్ ఏదైనా వేసుకుని వచ్చేవాణ్ణి' అన్నాడు.

రావుగారు నొచ్చుకుని, 'అయ్యో! మిమ్మల్ని సర్ప్రయిజ్ చెయ్యాలని ముందు చెప్పలేదు. ఐనా పంటినొప్పి ఉంటే, ఇడ్లీయే ఏంటి– ఏం తినాలన్నా బాధే కదా! పెయిన్ కిల్లరు టాబ్లెట్లు మా ఇంట్లో ఉన్నాయి. కావాలంటే ఇస్తాను' అన్నాడు గంభీరంగా.

కవిబాబు ఫక్కున నవ్వాడు. తర్వాత, 'జోక్ చేశాను. అర్థం కాలేదా?" అన్నాడు.

'జోకా?' అన్నాడు రావుగారు ఆశ్చర్యంగా.

కవిబాబు వెంటనే, 'నాకు జోక్సు వెయ్యడం అలవాటు. కానీ కవిని కదా, నా జోక్సు లోతుగా ఉండి, అందరికీ ఓ పట్టాన అర్థం కావు. అప్పుడు గణేశ్ దంపతులకీ అర్థం కాలేదు. ఇప్పుడు మీకూ అర్థం కాలేదు' అన్నాడు.

'గణేశ్ దంపతులా, వాళ్లెవరు?' అన్నాడు రావుగారు.

'వాళ్లు గొట్టింజన్ సిటీలో ఉంటారు లెండి. అక్కడా ఇలాగే ఓ షాపులో పరిచయమయ్యారు వాళ్లు. మీలాగే టిఫినుకు పిలిచారు. మీలాగే ఇడ్లీ టిఫిన్ పెట్టారు. అదే జర్మన్ ఇడ్లీ' అని గొంతు సవరించుకున్నాడు కవిబాబు.

ఆ ఇడ్లీలెంత గట్టిగా ఉన్నాయంటే, తింటుంటే పళ్లు కదిలిపోతున్న ఫీలింగొచ్చింది కవిబాబుకి.

వీడ్కోలు తీసుకుంటూ అతడు వాళ్లతో, 'మీరు నాకంటే చిన్నవాళ్లలాగున్నారు కాబట్టి దీవిస్తున్నాను. రాళ్లు తిని అరాయించుకునే శక్తి మీకు ఎప్పటికీ ఉండాలి' అన్నాడు.

వాళ్లకి కవిబాబు జోక్ అర్థం కాలేదు. వినయంగా ధన్యవాదాలు చెప్పారు.

'ఇడ్లీకంటే ఎక్కువ బాధపెట్టింది, వాళ్లు నా జోక్ అర్థం చేసుకోకపోవడం' అని, 'ఆ తర్వాత, ఇదిగో మళ్లీ ఈరోజు మీకూ నా జోక్ అర్థం కాలేదు' అన్నాడు కవిబాబు రావుగారితో.

రావుగారు నవ్వి, 'మీది జోకయితే, అది నాకెందుకు అర్థం కాలేదో, ఇడ్లీ తిన్నాక తెలుస్తుందిలెండి' అన్నాడు.

కవిబాబు ఒకసారి అతణ్ణి ఆశ్చర్యంగా చూసి, తన ముందున్న ఇడ్లీలపై నెయ్యి చల్లి, 'మనవాళ్లకి దూరదృష్టి ఎక్కువ. పాషాణాన్నయినా మెత్తబరుస్తుందని, ఇడ్లీలకి నెయ్యి కాంబినేషన్ చేశారు' అని ఆ దంపతులవంక చూశాడు.

'ఊఁ'' అన్నాడు రావుగారు.

'ఊఁ ఏమిటి? అది జోకు' అన్నాడు కవిబాబు మొహం చిన్నది చేసుకుని.

సత్యవతి మొహమాటానికి నవ్వింది.

కానీ రావుగారు, 'మీరు ఇడ్లీ రుచి చూసేదాకా నేను నవ్వనుకాక నవ్వను. మీరేమనుకున్నా సరే!' అన్నాడు.

కవిబాబు రావుగారిని అదోలా చూశాడు. ప్లేట్లోకి కొంచెం కొబ్బరి చట్నీ వడ్డించుకుని మొదటి ఇడ్లీ ముక్క విరిచి ఉలిక్కిపడ్డాడు.

వెంటనే చట్నీ అద్దుకుని నోట్లో వేసుకున్నాడు.

ఒక్క క్షణం.

అంతే, ఎవరో తరుముతున్నట్లుగా వాష్ బేసిన్ వద్దకెళ్లి చెయ్యి కడుక్కుని వచ్చాడు.

కవిబాబుకి టిఫిన్ నచ్చలేదని అర్థమై రావుగారి మొహం పాలిపోయింది. మనసులో మాత్రం, 'నచ్చకపోతే మాత్రం, మరీ అంత మొరటుగా తెలియజెయ్యాలా?' అనుకున్నాడు.

అలా జరుగుతుందని ఊహించలేదేమో, సత్యవతి కూడా నిశ్చేష్టురాలయింది.

మాటలు రాక తడబడుతున్న ఆ దంపతులిద్దరికీ చటుక్కున చేతులు జోడించాడు కవిబాబు.

ఇంకా తెల్లబోయి చూస్తున్న వాళ్లతో, 'ఈ బెర్లిన్ మహానగరంలో ఇలాంటి అద్భుతమైన ఇడ్లీ దొరుకుతుందని కలలో కూడా అనుకోలేదు. స్వతహాగా భోజనప్రియుణ్ణి. ఇప్పుడు ఇక్కడ దూదిపింజలాంటి ఇడ్లీ దొరకడంతో వెంటనే మొత్తం

లాగించెయ్యాలనిపించింది. ఐనా సరే, ఆ కోరికను కూడా జయించి చేతులు కడుక్కు వచ్చానంటే, ఎందుకో తెలుసా– ఇంత గొప్ప ఫలహారాన్ని బెర్లిన్ మహా నగరంలో నాకోసం తయారు చేసిన మీకు చేతులు జోడించడం తప్పనిసరి అనిపించింది. అదయింది కాబట్టి ఇక ఆగలేను' అంటూ తన సీట్లో కూర్చుని రెండిడ్లీలు చకచకా చట్నీతో తినేశాడు.

సత్యవతి మొహంలో సంతృప్తితో కూడిన చిరునవ్వు. ఆమె అతడితో, 'అల్లం చట్నీ కూడా రుచి చూడండి' అంది ఆప్యాయంగా.

'అదీ చూస్తాను. ముందు ఈ కోటా ఐపోనీండి' అన్నాడు కవిబాబు.

ప్లేట్లో వేసిన నాలుగు ఇడ్లీలూ కొబ్బరి చట్నీతోనే ఐపోయాయి.

'అల్లం చట్నీ రుచి చూడలేదు'' అంది సత్యవతి అసంతృప్తిగా.

'ఇప్పుడు చూస్తానుగా' అన్నాడు కవి బాబు.

సత్యవతి అతడి ప్లేట్లో ఒక ఇడ్లీ వేసింది.

'అయ్యో, ఒకటే వేశారేమిటి? నాలుగూ వేసెయ్యండి. తనను తక్కువ చేశానని అల్లం చట్నీ చిన్నబుచ్చుకుంటుంది' అన్నాడు కవిబాబు.

నిజంగానే అడిగేడా, జోక్ చేశాడా అన్న అనుమానంతో సత్యవతి ఒక్క క్షణం ఆగింది.

"ఏమిటీ సంకోచిస్తున్నారు! శనివారం కదా, ఫలహారం లైటుగా తీసుకోవాలనా?' అని నవ్వి– 'ఐతే మీకిప్పుడు మా అమ్మమ్మ గురించి చెప్పాలి' అన్నాడు కవిబాబు.

అతడి అమ్మమ్మకి సుగరొచ్చిందిట. బరువు తగ్గాలన్నారు. దాంతో ఆవిడ రాత్రిళ్లు అన్నం మానేసి ఫలహారం చేసుకుని తినడం మొదలెట్టింది. కానీ ఆవిడ బరువు తగ్గలేదు సరికదా, పెరగడం మొదలెట్టిందిట.

డాక్టరుకి చెబితే, ఆయన ఆవిణ్ణి కొన్ని ప్రశ్నలడిగేక– 'అమ్మా, నీ దోసుకి ఫలహారం కుదరదు. అన్నమే కంటిన్యూ చెయ్' అన్నాట్ట.

ఈ కథ విని రావుగారు నవ్వాడు.

కవిబాబు కూడా నవ్వి, 'ఇంతకీ నాది మా అమ్మమ్మ పోలిక' అన్నాడు.

రావుగారి నవ్వు ఆగిపోయింది.

అల్లం పచ్చడి కోటా ఐపోయేక– కారప్పొడి కోటా వచ్చింది. కవిబాబు కారప్పొడి కూడా చిన్నబుచ్చుకోకుండా జాగ్రత్త తీసుకున్నాడు.

ఆ తర్వాత ఒకో అనుపానానికి రెండేసి ఇడ్లీల చొప్పున– మరో ఆరు ఇడ్లీలు తిన్నాడు కవిబాబు.

ఆమె వేసినప్పుడు ఇడ్లీలు వాయకి పదహారు వస్తాయి. తినేది వాళ్ళే ఐనప్పుడు పూర్తిగా వాయ వెయ్యకుండా పదో పన్నెండో వేస్తుంది. ఈరోజు మొదటి వాయతో పాటు రెండో వాయ కూడా పూర్తిగా వెయ్యాల్సి వచ్చింది.

ఆ భోజన పరాక్రమం సత్యవతి ఊహించనిది.

సాధారణంగా ఆమె ఇడ్లీ పిండి తయారు చేసినప్పుడు మూడు నాలుగు రోజులకని చేస్తుంది. పిండి పులిసేక ఫ్రిజ్జిలో దాచి వీలును బట్టి వాడుతుంది.

అదే ఇప్పుడామె మర్యాద కాపాడింది.

అతిథులు మరీ మరీ అడిగి తింటుంటే– ఇల్లాలికి అంతకంటే సంతృప్తి ఏముంటుంది?

కానీ– మామూలు విందు భోజనమైతే ఆమెకి ఇబ్బంది ఉండేది కాదు.

"వాన కురుస్తున్న సమయంలో, పొడి కట్టెలు కోరిన పేద బ్రాహ్మణుడికి– ఓ భవనాన్ని కూలగొట్టి ఆ కలప ఇచ్చాడు కర్ణుడు. అందుకే ఆయన దానకర్ణుడిగా పేరుపడ్డాడు. బెర్లిన్ వంటి నగరంలో అపురూపమైన ఇడ్లీ నూక మొత్తం– ఒక్క మనిషి ఆతిథ్యం కోసం వెచ్చించడంతో మేమూ ఆ కర్ణుడంతటివాళ్లం ఐపోయాం. అందుకు మేము కవిబాబుకి కృతజ్ఞులం. మిమ్మల్ని ఇడ్లీ ఫలహారానికి పిలవడానికి షిప్పులో మరో లాట్ కోసం ఎదురుచూడాల్సొచ్చింది. అదీ కథ" అని కథ ముగించాడు రావుగారు.

అంటే కవిబాబుతో రావుగారికి కూడా ఇబ్బందికరమైన అనుభవాలు ఎదురయ్యాయన్నమాట!

అప్పుడు మేము కూడా అతడితో కవిబాబుతో మా అనుభవాలు పంచుకున్నాం.

అప్పుడు రావుగారు, "కవులు, రచయితలు– చాలా లోతుగా ఆలోచిస్తారనీ, ఎదుటివాళ్ల ఇబ్బందుల్ని చక్కగా అవగాహన చేసుకుంటారనీ అనుకునేవాణ్ణి. ఇప్పుడు నాకు కవులంటే కాస్త భయమేస్తోంది" అన్నాడు.

మేం కథలు రాస్తామని రావు దంపతులకి తెలియదు. అందుకే రావుగారా మాట నిస్సంకోచంగా అనగలిగారు.

"అయ్యో, అలాగంటారేంటి? మిమ్మల్ని దానకర్ణుడి పక్కన నిలబెట్టింది కవిబాబేనని మీరు ఇప్పుడే కదా అన్నారు" అన్నాను.

"అందుకేనండీ భయం! కర్ణుడు సూర్యపుత్రుడు కదా– అప్పుడప్పుడైనా తండ్రి కొడుకుని చూడ్డానికొస్తాడు కదా– పక్కనే ఉంటే ఆ వేడి మనం తట్టుకోగలమా?" అన్నాడు రావుగారు.

అదీ రావుగారి హాస్యస్ఫూర్తి.

చేదైన అనుభవాల్ని కూడా హాస్యంతో ముడిపెట్టి గుర్తుంచుకోవాలి. అందువల్ల మనకు నచ్చనివారు కూడా మన స్మృతుల్లో చేదు కాలేరు.

రావుగారి హాస్యస్ఫూర్తిలో మరో విశేషం– బాధితులకు కూడా ఆ బాధ తియ్యగా ఉంటుంది. ఉదాహరణకు నేనే...

(కొనసాగింపు వచ్చేనెలలో)

Post your comments